# విజయానికి దారి

సీరియస్‌గా పని చేసుకుంటున్న సుబ్బారావుకు సర్కులర్ తెచ్చి అందించాడు అటెండరు ఆదిత్య. సారాంశం చదివి బోల్డు ఆశ్చర్య పోయాడు వెంటనే అప్పారావు దగ్గరకు – అంటే పక్క సెక్షనుకు పరుగున వచ్చాడు.

" గురూ ! ప్రపంచ వింత జరిగి పోతున్నది." గుసగుసలాడాడు అతని చెవిలో.

" ఏంటది!?" ఆశ్చర్యంగా అడిగాడు అప్పారావు.

" సర్కులర్ అందలేదా ?"

" ఓ ! అదా ! అవును నాకు షాక్ కలిగింది."

" పిల్లికి బిచ్చం పెట్టంగా చూడలేదు – అటువంటిది మనందరికి పెద్ద హోటల్లో భోజనాలు ఏర్పాటు చేస్తున్నాడు మన బాసు. " సుబ్బారావు

" ఏదో సందర్భం రాశాడు గదూ !"

" ఆ ! వాళ్ళ వివాహదినమంట! అంటే పెళ్ళయి పాతిక సంవత్సరాలైన అశుభ – సారీ – శుభ సందర్భంలో పార్టీ యిస్తున్నాడు." చెప్పాడు.

" ఏదైతేనేం మనకు చేతి చమురు వదులుతుంది." అప్పారావు.

" అదేంటోయ్ గిఫ్టులు తెమ్మని రాయలేదుగా !" సుబ్బారావు

" అంటే చేతులూపుకుంటూ పోతావా ? తేరగా తిని రావడానికి మనకి సిగ్గుండద్దూ – పైగా ఫ్యామిలీసుతో రమ్మని రాశాడు. –" అప్పారావు

" ఈ భాగ్యానికి ఫ్యామిలీసును ఎవరు తీసుకొస్తారు కాని, మనం పోతే అదే గొప్ప !" సుబ్బారావు కొట్టిపారేశాడు.

" ఏంరోయ్ ! ఈ ఏడు ప్రమోషను గట్రా అక్కరలేదా ?" అప్పారావు గుర్తు చేశాడు.

" అవునురోయ్ ! తద్దినాల్లాగా ప్రతి సారీ ఇంటర్వ్యూ లుంటాయి గదా మనల్ని ఏరి పారెయ్యడానికి లిస్టులోంచి " నవ్వాడు సుబ్బారావు.

" అందుకే నువ్విలా మిగిలి పోయావు – అన్ని క్వాలిఫికేషన్లుంచుకుని – ఎవరు పెద్ద గిఫ్టు యిస్తే వారికి రికమెండ్ చేస్తాడనుకుంటూ మన బాసు" చెప్పాడు అప్పారావు.

అప్పారావు, సుబ్బారావులు ఒకే సారి ఆ ఆఫీసులో చేరారు. దాదాపు ఒక ఈడు వారే కావడంతో చాలా స్నేహంగా ఉంటారు.

సాయంత్రం ఇంటికి తొందరగా చేరి అప్పలనర్సమ్మకు ఈ వార్త అందించాడు.

" అప్పలనర్సమ్మా ! నువ్వు కాస్త తొందరగా తయారు కావాలమ్మా !"

" ఏం దొరగారు – సినిమాకు తీసుకు పోతారా?" ఆశగా అడిగింది.

" నీ మొహం – మా బాసు అక్కడ పెళ్ళి చేసుకుంటూ ఉంటే – మనం సినిమాకు పోతే యింకేమైనా ఉందా?" కోప్పడ్డాడు.

" అయ్యో ! అయ్యో ! ఈ వయసులో ఆయనకు పెళ్ళేమిటండీ !" ఆశ్చర్య పోయింది అప్పలనరసమ్మ.

"పెళ్ళి కాదే – లాంటిది .... వాళ్ళ వివాహ దినంట – సిల్వర్ జుబ్లీట ! అందుకని మనందరికి స్టార్ హోటల్లో భోజనాలు ఏర్పాటు చేశాడు..." చెప్పాడు.

" అబ్బో! మీ బాసుకు అప్పుడప్పుడు మంచి బుద్ధులు కూడ పుడుతుంటాయే ! ఏమో అనుకున్నా –" మెచ్చుకుంది – నరసమ్మ.

"నీ బొంద ! అది మన మీద ప్రేమతో కాదే – మనం తెచ్చే బహుమానాల మీద ప్రేమ – " వివరించాడు సుబ్బారావు.

" పోండి ... అది అయ్యుండదు – మీరు తెచ్చే బోడి ప్లాస్టికు ప్లేటు కోసం – గాజు గ్లాసుల కోసం అన్ని వేలు ఖర్చు పెడతారా !"

"సరె నువ్విలాగే మాట్లాడు తూండు – మనమెళ్ళే సరికి అందరూ మేసి చేతులు కడుక్కుంటూ ఉంటారు – చివరికి మనం వెళ్ళి పళ్ళాలు తియ్యాలి." విసుక్కున్నాడు.

మార్కెట్టులో మళ్ళీ సందేహంలో పడిపోయారు ఏగిఫ్టు యివ్వాలా అని. నానా

రకాల వస్తువులున్నాయి గాని - అది ఆయనకు ఏరకంగా పనికొస్తాయో అర్థం కాలేదు. కింకర్తవ్య విమూఢుడై ఉన్నప్పుడు భార్యామణి సాయిబాబాను ప్యాక్ చేయించింది. సాయి బాబా చుట్టూ లైట్లు అందంగా వెలుగుతూ ఆరుతూ ఉంటాయి - బటన్ను నొక్కే కొద్దీ ఆరేడు పద్ధతుల్లో లైట్లు వెలుగుతాయి. ఓ నాలుగొందలు జేబులోంచి ఎగిరి పోయాయి. దాన్ని నీటుగా ప్యాక్ చేయించింది.

హోటలు చేరుకునే సరికి అక్కడ హాల్లో మీటింగు లాగా ప్రారంభమవుతున్నది. అప్పటికే బాసుగార్ని పుష్పమాలాంకృతుల్ని చేశారు. వీళ్ళదే ఆలశ్యం.

" ఒసేయ్ ! నీకూ ఆలోచనరాలా - నాకూ రాలా - ఒక్క దండ అన్న తెచ్చి ఉంటే బాగుండేది కదే !"

"దండ ఎందుకు దండగ ! అది ఊరికే పక్కన పారేస్తారు - మన గిఫ్టు మటుకు ఆయన పోయినా పర్మనెంటుగా ఉంటుంది."

"ష్ ! అశుభం పలక మాకవే అక్కు పక్షి - వింటారు ఎవరైనా - వెంటనే ఆయనకి చేరవేస్తారు." కోప్పడ్డాడు అప్పలనర్సమ్మను.

సుబ్బారావు వేదిక దగ్గరకు పోయి తన బహుమతి అందించాడు ఆనిత్యనూతన దంపతులకు ఫోటో క్లిక్ అంది.

" ఎందుకోయ్ ఇవన్నీ - మీరు రావడమే గొప్ప కానుక !" చెప్పాడు భీమశంకరం - బాసు.

" మీ ఆవిడ వచ్చిందా? " అడిగింది ఆండాళ్ళమ్మ - అతని భార్య.

" అయ్యో ! ఇటువంటి వాటిల్లో ఆమె ముందుంటుంది." చెప్పాడు.

" మరి వచ్చి ఫోటో తీయించుకోమను." చెప్పింది.

సుబ్బారావు పరుగెత్తుకుంటూ వచ్చి ఆమెను లాక్కుపోయి వారి ప్రక్కన ఫోటో దిగాడు.

కాసేపటి తర్వాత భీమశంకరం ఉపన్యాసం యిచ్చాడు - చివరగా ఒక విజ్ఞప్తి చేశాడు.

"మైడియర్ ఫ్రెండ్సు – మీకో చిన్న విన్నపం – అదే పనిగా హైద్రాబాదునుండి మా బావమరిది వచ్చాడు ఈ సందర్భానికి. అతని పేరు వంశీ కృష్ణుడు... అతనేదో చేస్తున్నాడు – నాకు ఆ వివరాలు తెలియవు – అతను నన్ను అడిగాడు కాస్త మాట్లాడనివ్వమని – అతను చెప్పింతర్వాత – మీ అందరికి విందు ఉంటుంది – థ్యాంక్స్ !" అంటూ కూర్చున్నాడు.

కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

ఈలోగా వంశీకృష్ణుడు మైకు పట్టేసుకున్నాడు. మైకాసురుడు లాగున్నాడు.

"నేనొకటి అడుగుతాను – సమాధానం చెప్పండి – మనకు – కర్నూలు గాడిదకు తేడా ఉందా?" ప్రేక్షకులనుద్దేశించి అడిగాడు

'వీడెక్కడి కృష్ణుడు అండి బాబు నికృష్టుడు లాగా ఉన్నాడు' తిట్టుకున్నాడు ఆ పోలికకు సుబ్బారావు.

"ఆ ! ఉంది – మనం నిలువుగా నిల్చుంటాం – అది అడ్డంగా నిలబడుతుంది – " అప్పారావు చెప్పాడు అందరూ సైలెంటుగా ఉండగా.

"వెరీగుడ్ ! అంతే తేడా ! అది రాత్రింబవళ్ళు బట్టలు మోస్తూ ఉంటుంది – మనం బాధ్యతల్ని మోస్తూ ఉంటాం – దానికి సుఖం లేదు – మనకి సుఖం లేదు – మీరు రోజుకు ఇరవై గంటలు కష్టపడ్డా ఏం సంపాదించారు కనుక !" వంశీకృష్ణుడు ప్రశ్న విసిరాడు.

"అప్పులు !" అప్పారావు ఠపీమని చెప్పేశాడు.

"అంతే ! సగటు మనిషి సంపాదన అంతే ! వాడు అప్పుల్లో పుడతాడు – అప్పుల్లో పెరుగుతాడు – అప్పుల్లో పోతాడు – పోతూ పోతూ తన వారసత్వంగా అప్పులు చేసి తన కొడుకులకిచ్చి పోతాడు – అది మన బతుకు – ఈ రుణానుబంధాలనుండి విముక్తి లేదా?" వంశీకృష్ణుడు అడిగాడు అందర్నీ.

అందరూ బుర్రలు గోక్కుంటున్నారు ఇతగాడి ఉద్దేశ్యం అర్థం గాక .

"మీరు పని చెయ్యొద్దండి – కష్టపడి పని చెయ్యొద్దండి – గాడిదలాగా పని

చెయ్యొద్దండి - స్మార్టుగా పని చెయ్యండి. దేవుడు మీ కిచ్చిన ఇరవై నాలుగు గంటలు పనిచేసినా మీరు ఈ రుణాను బంధంనుండి బయటపడలేరు - అందుకే మీరు పని చేసే గంటలు పెంచుకోవాలి!"

" అదేలా సాధ్యం బాబు !" ఎగతాళిగా అడిగాడు సుబ్బారావు.

"ష్ ! మీ తెలివి తక్కువ తనం ఇక్కడ బయట పెట్టద్దు." తొడ పాశం పెట్టింది అప్పల నర్సమ్మ ఎవరూ చూడకుండా.

" మీరు ఎంత చేసినా పది గంటలు పని చెయ్యగలరు - అదే మీ తరుపున ఇంకో పది మంది పది గంటల చొప్పున పని చేస్తే ఎన్ని గంటలవుతుంది? మొత్తం నూట పది గంటలు - మళ్ళీ ఆ పది మంది తరుపున వందమంది చేస్తే పదకొండొందల పది గంటలు - అలా తెలివిగా మనం మనకున్న పని గంటల్ని పెంచుకుంటూ పోవాలి - ఇదే సక్సెస్ వేటు లైఫ్ చెప్పేదిఅంటే, జీవితంలో విజయానికి దారిని చూపెడుతుంది మా కంపెనీ." అంటూ తన స్కీము వివరించసాగాడు - ఓ అరగంట వాయించేశాడు.

బ్రీఫు కేసులోంచి తీసి రకరకాల వస్తువుల్ని బయట పెట్టాడు. అవి ఎలా పని చేస్తాయో చెప్పాడు - దేనికి వాడతారో చెప్పాడు.

" ఇవన్నీ అమెరికాలో తయారైనవి - ఎన్నో వందల సంవత్సరాలు రీసెర్చి ఫలితం ! గాటు ఒప్పందం పుణ్యమాని - ప్రపంచ సరళీ కృత ఆర్థిక విధానం వలన - మన పూర్వ జన్మ సుకృతం వలన ఇవి అందుబాటులోకి వచ్చాయి. మన పూర్వీకులకు ఇవి అందుబాటు లో లేవు. ఉదాహరణకు ఈ టూత్ పేస్టు చూడండి - నోట్లో పెట్టుకోగానే కరిగి పోతుంది."

"అదేం చాక్లెట్ కాదుగా తిండానికి - కరిగి పోతుందంటాడు -" సుబ్బారావు డౌటు పడ్డాడు.

" ష్! వినండి - " కసురుకుంది అప్పలనర్సమ్మ.

" మనకు బజార్లో దొరికే పేస్టులు బ్రష్ నిండా వేసుకున్నా పాచి పోదు

కదూ ! కాని దీన్ని ఒక్క మిల్లీ మీటరు వేసుకుంటే రోజల్లా నోరు తాజాగా ఉంటుంది – ఎవరన్నా వాడతారా ఇప్పుడు –" అంటూ ముందు వరుసలో వాళ్ళకి కాస్త కాస్త వేశాడు.

భీమశంకరం అందర్నీ గమనిస్తున్నాడని గ్రహించినవాడై సుబ్బారావు ముందుకు పోయి వేలి మీద వేసుకుని ఆ పేస్టును చప్పరించాడు, బాగుంది! "ఇంకొంచెం పెట్టు" అని అడిగాడు సుబ్బారావు.

"ఇదేం తినే వస్తువు కాదండి ! బ్రష్ చేసుకోవాలి !" వంశీకృష్ణుడు చెప్పాడు – దాని గొప్పతనం వివరించాడు.

"ఇంతకీ ఖరీదెంత ?" అప్పారావు అడిగాడు.

"ఇంత అద్భుతమైన పేస్టు ఇంత తక్కువ ధరాని మీరు ఆశ్చర్య పోతారు – కేవలం మూడొందల యాభై రూపాయలు మాత్రమే !"

సుబ్బారావుకు కళ్ళు తిరిగాయి.

" బజార్లో ముప్పయి పెడితే మంచి మంచి పేస్టులు వస్తాయి కదా – ఇంత వేస్టు చేసి ఎవరు కొంటారు" అప్పారావు అనుమానం.

" ఒక్కసారి మీరు రుచి చూపిస్తే వదలరండి .... అనవసరంగా కెమికల్స్ పేస్టు వాడి వాడి – పళ్ళు పాడు చేసుకుంటున్నాం – పళ్ళ డాక్టర్లకు బళ్ళ కొద్దీ ఫీజులు చెల్లిస్తున్నాం – మా పేస్టు వాడి చూడండి – మీ పళ్ళ సమస్యలు మటుమాయం !" అంటూ ఎన్నో ఐటమ్స్ గురించి వివరించాడు.

చివరగా చెప్పాడు. " ఈ వస్తువులన్నీ బజార్లో దొరికేవి కాదండి. కేవలం మెంబరు దగ్గర మాత్రమే దొరికేవి ! మీరు మీ కింద ట్రైలు పెంచుకుంటూ పోతే మీకు ఎన్నో రకాల ప్రమోషన్లుంటాయి. కారు వస్తుంది... జాలీ ట్రిప్పు అమెరికాకు పోవచ్చు – మీ బ్యాంకు బాలెన్సు పెరుగుతుంది... సంఘంలో మీ స్టేటస్ పెరుగుతుంది. మీకు – మీవారసులకు – వారి వారసులకు పెన్షన్ లాగా డబ్బులు వస్తూనే ఉంటాయి. ఇదంతా కేవలం మీ ఆఫీసు పని మీరు చేసుకుంటూ మీ తీరిక సమయాల్లో చేసుకుంటే

చాలు. ప్రస్తుతానికి ఈ సక్సెస్‌వే ఆఫ్ లైఫ్ లో నెలకు లక్షరూపాయల పైన సంపాదిస్తున్న వాళ్ళు వందమంది పైన ఉన్నారు త్వరలోనే వారు ఐదు లక్షల సంపాదన కూడ దాట బోతున్నారు. విజయవాడలో అయితే ఒకామె కోటీశ్వరురాలై పోయింది.... తన జాబ్ రిజైన్ చేసి దీంలోనే ఫుల్ టైమ్ చేస్తున్నది..." అంటూ లాభాలు తెగచెప్పాడు.

"మెంబరు కావాలంటే ఎంత కట్టాలి" అప్పారావు అడిగాడు.

"అబ్బే ! ఎంతో లేదు – కేవలం పదివేలు మాత్రమే ! ఆ పది వేలకు గాను ఏడు వేల సరుకు మీకిచ్చేస్తాడు – అది అమ్ముకుంటే పన్నెండు వేలు వస్తుంది – రెండు వేలు లాభం కూడ – ఇలా సరుకు తెచ్చుకోవడం అలా అమ్మడం –– ఇది మన ఒక్క దేశంలోనే కాదు – ప్రపంచంలోని మూడొందల దేశాల్లో ఉంది." చెప్పాడు వంశీకృష్ణుడు.

"సుబ్బారావు – ప్రపంచ దేశాల సంఖ్య ఎంత?" అప్పారావుకు అనుమానం వచ్చింది.

"నాకు మటుకు ఏం తెలుస్తుంది!" వాపోయాడు సుబ్బారావు.

భీమశంకరం బామ్మర్ది కూర్చోగానే డిన్నరు ప్రారంభమైంది. అప్పారావుకు కొంచెం మొహమాటం తక్కువ. అందుకని రెండు కంచాల్లో పదార్థాలు వేయించుకుని ఓ మూల కూర్చుని తినడం మొదలెట్టాడు.

వంశీకృష్ణుడు అతని దగ్గరకు వచ్చాడు "మీ పేరు రాసుకోమంటారా." అప్పారావు ఉలిక్కిపడ్డాడు – కాస్త తినడం ఆపి– సుబ్బారావును చూపించాడు. వంశీకృష్ణుడు అతన్ని సమీపించాడు.

"మీరు చెప్పింది చాలా బాగుంది – కాని నేను చెయ్యలేను –"సుబ్బారావు మర్యాదగా తప్పుకున్నాడు.

"చూడండి సిస్టరు – మీవారు సువర్ణ అవకాశాన్ని కాలదన్నుకుంటున్నాడు. నేను మీ లాగే ముందు వద్దన్నాను మా సీనియరు అడిగినప్పుడు తరువాత నాకు జబ్బు చేసినప్పుడు మామూలు మందులు వాడినా తగ్గక పోతే – ఈ కంపెనీ సహజ

వనమూలికలు వాడాను. ఎలా ఉన్నానో మీరే చూస్తున్నారుగా - ఆ తరువాత బుద్ధి తెచ్చుకుని జాయిన్ అయ్యాను. ఇప్పుడు నాకు నెలకు యాభై వేలు వస్తున్నది - అదే ముందు చేరి ఉంటే లక్షరూపాయలు వస్తూండేవి." చెప్పాడు వంశీకృష్ణుడు.

"ఏమండీ ! ఆయన అంత అడుగుతున్నాడు గదా - చేరకూడదు." అప్పల నరసమ్మ అడిగింది.

అంతే ! ఇంక అతని పని ఈజీ అయిపోయింది.

మరునాడు యింటికి వచ్చి పదివేలు కట్టించుకుని అతన్ని మెంబరుగా చేర్చేశాడు వంశీకృష్ణుడు.

అలా ఆ ఆఫీసులో ఓ అయిదు మంది దాకా చేరిపోయారు.

" మీటింగులకు హైదరాబాద్‌కు వస్తూ ఉండండి... ఈ ఊళ్ళో కూడ పెడుతుంటాం - అప్పుడు మీకు తెల్సిన వాళ్ళను పట్టుకు వస్తూ ఉండండి-" అని కొన్ని మార్గదర్శక సూత్రాలు చెప్పి వెళ్ళి పోయాడు వంశీకృష్ణుడు.

కొన్నాళ్ళకు సరుకు వచ్చింది యింటికి.

సుబ్బారావు - అప్పలనరసమ్మ వాటిని అమ్మ బోయారు.

ప్రజలు వీళ్ళని తిక్కవాళ్లని చూసినట్లు చూశారు. డిస్కౌంటుకు అమ్ముతామని చెప్పినా తీసుకోలేదు.

మెడికల్ షాపుల్లో పెడదామని చూశారు - వాళ్ళ సమాధానాలు ఆశ్చర్య పరిచాయి.

"రూపాయి మందు కొనాలంటే ఏడ్చిచస్తారు ప్రజలు- అంత కంటె తక్కువది ఉందాని అడుగుతారు - అటువంటిది ఇన్ని వందలు - వేలు ఖరీదు అయినవి ఎవరు కొంటారు?"

"ఇవన్నీ నేచురల్ - ఆరోగ్య హాని చెయ్యవు - రోగాలు మటుమాయం - ఆయుష్షు పెంచుతాయి" అని నచ్చ చెప్పబోయారు.

"ఇవి అమెరికా నుండి నేరుగా వచ్చాయి - అందుకే కొంచెం ఖరీదు

ఎక్కువ. కాని క్వాలిటీ చూస్తే చాలా చీపు !" తెలియపరచారు.

వీళ్ళ మొహమాటానికి ఒకటి రెండు షాపుల్లో సరుకులు పెట్టుకున్నా అవి అమ్ముడు పోలేదు.

పేస్టు ఖరీదు వినగానే కొందరు " ఓర్నీ! మేం నీ కంటికి ఎలా కనిపిస్తున్నాం? కోటీశ్వరులమనుకున్నావా? మూడొందలు పెట్టి పేస్టు వాడ్డానికి ... మాకు మామూలు పేస్టు చాలు."

" అది కాదు ఇది కొంచెం – ఒక్క మిల్లీ మీటరు వేసుకుంటే చాలు." చెప్పాడు సుబ్బారావు .

" పొద్దున్నే స్కేలు – చాకు పెట్టుకుని కూర్చోమంటావా మా ఆవిడ దగ్గర పిల్లల దగ్గర – పేస్టు ఎక్కువ వేసుకోనివ్వకుండా? నన్ను ముష్టి వెధవనుకుంటారు అలా చేస్తూ ఉంటే!" కసురుకున్నాడు.

అప్పారావు ఆశకొద్దీ ఆ కంపెనీలో పెద్ద ప్రమోషను రావాలని ఓ రెండు లక్షల సరుకు కొని ఓ కారేసుకుని గ్రామాలకు గ్రామాలు తిరిగాడు అవి అమ్ముదామని.

పది అడుగులు ముందుకు పోయి – పదహారు అడుగులు వెనక్కి వచ్చినట్లయింది అతని పని.

వాళ్ళు వాడితే చాలు – మళ్ళీ వచ్చి కొనుక్కుంటారని – అప్పారావు కొందరికి అప్పు యిచ్చాడు సరుకుల్ని – వాళ్ళు అప్పుతీర్చలేదు. సరుకు వాపసు ఇవ్వలేదు. అడిగినప్పుడల్లా – " ఇస్తాంలేవయ్యా ! ఎక్కడో పెట్టాం – " అని కొందరంటారు.

కొందరు " వాడాం కాని అస్సలు పని చెయ్యలేదు – నువ్వు చెప్పినట్లు మా ఆరోగ్యం ఏమీ బాగుపడలేదు – నీకెందుకు డబ్బు లివ్వాలని " నిర్మొహమాటంగా ఎగ్గొట్టేశారు.

సుబ్బారావు తను తెచ్చుకున్న సరుకుల్ని తన యింట్లో ఉపయోగించడం మొదలు పెట్టాడు.

అప్పారావు కూడ వాడుతున్నాడు కాని.... అన్నివేల ఖరీదు మందులు

తానొక్కడే వాడుకునేటంత కోటీశ్వరుడు కాదు – ఇద్దరూ ఒకేసారి భీమశంకరం దగ్గరకు వెళ్ళారు తమ సమస్యలు చెప్పుకోవడానికి.

“ సార్ ! ఒక్కసారి మీ బామ్మర్ధిని పిలిపించండి సార్ !” సుబ్బారావు

“ అతనితో మాకు పనుంది సార్ !” అప్పారావు

“ ఏం మీ వ్యాపారాలు బాగా జరుగుతున్నాయా ?” భీమశంకరం.

“ కాదు సార్ ! మోసపోయాం సార్ – నాది పదివేలు బూడిదలో పోసిన పన్నీరైంది సార్!” సుబ్బారావు బాధపడ్డాడు.

“ సార్ ! వాడిది పది వేలే – నేనైతే రెండు లక్షలు అప్పు తెచ్చి పెట్టాను సార్ – వడ్డీలు కట్టలేక నా దుంప తెగుతున్నది. అయినకాడికి మీ బామ్మర్ధిని నాసరుకు తీసుకు పొమ్మనండి సార్ – సిటీలో బాగా అమ్ముడు పోతున్నదట !” అప్పారావు ఏడ్చేశాడు. ఆయన కాళ్ళ మీద పడబోయినంత పని చేశాడు.

“ సరే జరిగి పోయిందేదో జరిగి పోయింది – అయినకాడికి అమ్ముకోండి – లేక పోతే వాడు కోండి –” సలహాయిచ్చాడు భీమశంకరం.

“ సార్ ! మా నష్టాలనుండి మీరే కాపాడాలి సార్!” అప్పారావు చేతులు పట్టుకున్నాడు – సుబ్బారావు కూడ పట్టుకో బోయాడు.

“ అది కాదయ్యా అప్పారావు – కొనే ముందు తెలివి ఉండద్దు – మనం అమ్ముకోగలమా లేదా అని ఆలోచించద్దు?” ఆండాళ్లమ్మ కోప్పడింది.

“ బుద్ధి గడ్డి తిని – మీ వాడి మాటలకు మోసపోయి కొన్నాం – ”

“ మీ వంశీకృష్ణుడు మహా మాటకారి !”

“ అనికృష్ణుడు అంటే నాకూ మంట – ఏదో ఆరోజు అనుకోకుండా వచ్చి ఓ పది నిమిషాలు మాట్లాడనిమ్మంటే మాట్లాడనిచ్చాం – మీరంతా ఆవేశ పడి చేరిపోయారు” చేతులు దులుపుకున్నాడు భీమశంకరం.

“ అమ్మా ! ఆండాళ్ళమ్మగారు – మీ తమ్ముడు కు మీరన్నా చెప్పండి – మీ మాట తప్పకుండా వింటాడు – కనీసం నష్టానికైనా తీసుకోమనండి.” అప్పారావు

" ఛీ ఛీ ! వాడి మాటెత్తద్దు - వాడికి మాకు ఏం సంబంధం లేదు. ఎప్పుడో వదిలేశాం వాడ్ని. చిన్నప్పటినుంచి ఇలా ఆవారాలా తిరుగుతున్నాడు." ఆండాళ్ళమ్మ మొహంచిట్లించి లోపలికి వెళ్ళిపోయింది.

" సార్ ! మరి మా నష్టాలు ఎలా సార్ !" కోరస్‌గా అడిగారు.

" అనుభవించండి - మీ పేరాశ మిమ్మల్ని దెబ్బతీసింది - ఈజీ మనీ సంపాదిద్దామని ఆశపడితే ఉన్నది కూడ పోయింది." హితబోధ చేశాడు భీమశంకరం.

సుబ్బారావు, అప్పారావులు పట్టువదలని విక్రమార్కుళ్ళలాగా హైద్రాబాదుకు పోయి వంశీకృష్ణుడ్ని కలిశారు.

" మీరు చేసుకున్న దానికి నేనేం చేస్తాను. ఇక్కడ బ్రహ్మాండంగా అమ్ముడు పోతున్నాయి - లక్షలు సంపాదిస్తున్నారు. ముందే తెల్సుగా మీకు - అమ్ముకోవాలని ... " చికాగ్గా చెప్పాడు.

" కొంచెం మాస్టాకు మీరు వాపసు తీసుకుని అమ్ముకోవడం కాని - అమ్మించడం గాని చేస్తారని - మాకు పడ్డధర కంటే కొంచెం తక్కువ తీసుకున్నా ఫర్వాలేదు" ఇద్దరూ అతని వెంట బడ్డారు.

"లాభం లేదు - మా వ్యాపారాలే మేం చేసుకో లేకుండా ఉన్నాం - ఇంక మీది మేమెక్కడ చెయ్యం - ఏం ఫర్వాలేదు - నిదానంగా అమ్ముకోండి - అనుభవం వస్తుంది - లేదా ఆ ప్రాడక్టును మీరే వాడుకోండి ఆరోగ్యం వస్తుంది.... సక్సెస్ వే ఆఫ్ లైఫ్ వారి ట్రైనింగ్ క్లాసులకు కావాలంటే హాజరు కండి - " అని నిర్మొహమాటం లేకుండా చెప్పేసి సక్సెస్ వే ఆఫ్ లైఫ్ వారిచ్చిన కారులో వెళ్ళి పోయాడు.

" వీలైనంత మంది జనాన్ని వీలైనన్ని రకాలుగా ముంచడమే విజయానికి దారి" సుబ్బారావు వాపోయాడు.

" నమ్మిన వాళ్ళను నట్టేట ముంచే వాళ్ళే బజారులో హీరోల్లాగా వెలిగి పోతున్నారు - " అప్పారావు బాధగా చెప్పాడు.